క్లుప్తంగా

వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

బలిజిపేట: మండలంలోని చిలకలపల్లి వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు రాంబాబు భక్తుల గోత్రనామాలతో పూజలు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. సుబ్రహ్మణ్య షష్టి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

చట్టాలపై అవగాహన ఏర్పరచుకోవాలి

- ఎస్సై సురేష్



మాట్లాడుతున్న మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై సురేష్

పార్వతీపురం టౌన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్సై సురేష్ అన్నారు. మండలంలోని చిన్న బొండపల్లి గ్రామంలో పాఠశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలపై జరిగే నేరాలు, పోక్సో చట్టం, బాల్య వివాహాలు డ్రగ్స్, సైబర్ నేరాలు, తదితర అంశాలపై తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయవద్దని విద్యార్థులే తల్లిదండ్రులకు చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు, సచివాలయం మహిళా పోలీస్, మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ



విద్యార్థులకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న ఎస్సై వెంకటరమణ

మక్కువ: మండలంలోని ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాలలో మెగా పేరెంట్స్ మీటింగ్ సందర్భంగా ఎంఎస్ఆర్ ఫౌండేషన్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జెమ్స్ ఆస్పత్రి సిబ్బంది (శ్రీకాకుళం) శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటరమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంబటి పుష్పనాథం, ఎమ్మెస్సార్ ఫౌండేషన్ అధ్యక్షుడు మరడ శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు ఎస్సై వెంకటరమణ వాలీబాల్ కిట్లు అందించారు.

లే అవుట్ల పరిశీలన



జగనన్న కాలనీ లే అవుట్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారి కామేశ్వరరావు

మక్కువ: మండలంలోని జగనన్న కాలనీ లేఅవుట్లను విజిలెన్స్ అధికారి అట్టాడ కామేశ్వరరావు శనివారం పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.. లబ్ధిదారలందరికీ అర్హత ఉందా.. ఇంకా ఎన్ని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదు.. తదితర అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సింహాచలం, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పైడితల్లి, రామకృష్ణ పాల్గొన్నారు.

రసాభాసగా పేరెంట్స్ మీటింగ్



భోజనం బాగోలేదని హెచ్ఎంను నిలదీస్తున్న మహిళలు

పాచిపెంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్ రసాభాసగా మారింది. పాఠశాలలో మౌలిక వసతులు బాగోలేవని, మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండడం లేదని తల్లిదండ్రులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకం అమలు కావడం లేదని ఆరోపించారు.

ఆహారం.. ఆరోగ్యం..







- మెరుగైన ఆరోగ్యానికి విటమిన్లు అవసరం
- పౌష్టికాహారం తప్పనిసరి
- విటమిన్లు లోపిస్తే ఆరోగ్య సమస్యలు

బలిజిపేట: విటమిన్లు ఆరోగ్య రక్షణకు ఎంతో అవసరం. వ్యాధులు రాకుండా ఉండాలన్నా, ఒక వేళ సోకిన వ్యాధులు త్వరగా తగ్గిపోవాలన్నా శరీరంలో తగిన రోగనిరోధక శక్తి అవసరం. అందుకు శరీరానికి విటమిన్లు సహాయపడతాయి. అన్ని సీజన్లలో కంటే చలికాలంలో ఇన్‌ఫెక్షన్లు, సీజనల్ వ్యాధులు సోకే అవకాశాలున్నాయి. చల్లటి గాలుల వల్ల పిల్లలు, పెద్దల్లో అనారోగ్య సమస్యలు చోటుచేసుకుంటాయి. వీటిని నిరోధించడానికి విటమిన్లు ఉండే ఆహార పదార్థాలు అవసరం.



విటమిన్ - ఎ

చలికాలంలో జలుబు, శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు, జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. రోగనిరోధక శక్తి పెంచడం వల్ల వీటిని నివారించవచ్చు. దీనికి విటమిన్ - ఎ ఎంతో సహాయపడుతుంది. అందుకు క్యారెట్లు, చిలగడ దుంపలు, పాలకూర, పాలు, క్యాప్సికం, గుమ్మడికాయ వంటి వెజిటబుల్స్‌లో విటమిన్ - ఎ పుష్కలంగా ఉంటుంది.

విటమిన్ - డి

తెల్ల రక్తకణాలైన మోనో సైటిస్ సామర్థ్యాన్ని పెంచడంలో, జలుబు, దగ్గు, గొంతు నొప్పి ఇలా అనేక రకాల సీజనల్ వ్యాధులను, ఇన్‌ఫెక్షన్ల ప్రమాదం నుంచి విటమిన్ డి బాగా కాపాడుతుంది. కొవ్వు చేపలు, కోడిగుడ్డు సొన, మష్రూమ్స్ వంటి వాటిలో ఇది పుష్కలంగా ఉంటుంది.

విటమిన్లు అవసరం..



ప్రతి మనిషికీ విటమిన్లు శరీర ఆరోగ్యానికి అవసరం. వారి వారి అలవాట్లు, పరిసరాలు, ఆహారం వంటి వాటిమీద విటమిన్లు లభ్యత ఆధారపడి ఉంటుంది. విటమిన్లు కలిగిన పోషక ఆహార పదార్థాలు తీసుకోవాలి. ఎక్కువుగా ఆకుకూరలు, పాలు, పండ్లు, గుడ్లు వంటివి తీసుకుంటే మంచిది.

– క్రాంతి కిరణ్మయి,
బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి

విటమిన్ బి- 12

శరీరానికి అవసరమయ్యే అత్యంత ముఖ్యమైన వాటిలో బి - 12 విటమిన్ కీలకమైనది. ఇది తెల్ల రక్త కణాల ఉత్పత్తిని, రోగ నిరోధకశక్తిని పెంచుతుంది. నాడీ వ్యవస్థను బలోపేతం చేస్తుంది. వైరల్ ఇన్‌ఫెక్షన్లు, సీజనల్ వ్యాధుల బారినుంచి శరీరాన్ని రక్షిస్తుంది. సాల్మన్ చేపలు, చికెన్, కోడిగుడ్లు, పాలు వంటి పదార్థాలలో విటమిన్ బి- 12 ఉంటుంది.

విటమిన్ - ఇ

యాంటీ ఆక్సిడెంట్లను కలిగి ఉండి, రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ విటమిన్ ఎంతోబాగా పనిచేస్తుంది. ఫ్రీ రాడికల్స్‌ను నియంత్రిస్తుంది. రోగ నిరోధక కణాల పనితీరును మెరుగుపరుస్తుంది. ఆకుకూరలు, నట్స్, సీడ్స్, కోడిగుడ్లు, గుమ్మడి గింజలు, చేపలు వంటివి రోజువారీ డైట్‌లో చేర్చుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.



విటమిన్ బి- 6

విటమిన్ బి - 6 శరీరానికి అవసరమైన అతి ముఖ్యమైన పోషకం. ఇది రోగ నిరోధక కణాలను పెంచడంతో పాటు ఇన్‌ఫెక్షన్లు, సీజనల్ వ్యాధుల బారినుంచి త్వరగా కోలుకోవడంలో సహాయపడుతుంది. బీన్స్, కోడిగుడ్లు, నట్స్, సోయా ప్రొడక్ట్స్, మీట్స్‌లలో విటమిన్ బి- 6 ఎక్కువుగా లభిస్తుంది.

విటమిన్ - సి

శరీరంలో ఇమ్యూనిటీ పవర్ పెరగడానికి విటమిన్ సి ఎంతో ఉపకరిస్తుంది. దీన్ని మైక్రో న్యూట్రియంగా పేర్కొంటారు. తెల్ల రక్తకణాల ఉత్పత్తి, పనితీరులో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. నిమ్మ, నారింజ, బెర్రీ వంటి వివిధ రకాల సిట్రస్ పండ్లలో ఇది ఎక్కువగా లభిస్తుంది.

సబ్‌స్టేషన్‌లో పెట్రోలింగ్ పనులు



లైన్ పెట్రోలింగ్ చేస్తున్న ఇన్‌స్పెక్టర్లు

సీతానగరం: మండలంలోని అప్పయ్యపేట సబ్‌స్టేషన్‌లో పెట్రోలింగ్ పనులు చేపడుతున్నారు. ఈ పనులను ఏపీఈపీడీసీఎల్ ఏఈ జగన్ మోహనరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యుత్ అంతరాయం నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బూర్జ, సీతానగరం సబ్‌స్టేషన్‌లలో ఇటీవల కురిసిన వర్షాలకు ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ పాడవుతుండడంతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఈ నేపథ్యంలో సబ్‌స్టేషన్‌లో పెట్రోలింగ్ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మన్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ మారుస్తున్న టెక్నికల్ సిబ్బంది

అంతర పంటల సాగుపై ఆసక్తి



పామాయిల్ తోటలో మిశ్రమపంటగా నాటిన అరటి మొక్కలు

సీతానగరం: మండల రైతులు అంతరపంటలపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఇంతవరకు చెరకు, పామాయిల్ సాగుచేస్తూ నష్టాలు చవిచూసిన రైతాంగం తాజాగా మిశ్రమ పంటలు సాగుచేస్తూ నాలుగు డబ్బులు కళ్లజూస్తున్నారు. పామాయిల్ తోటల్లో అరటి, ఆకుకూరలు, కూరగాయలు, మొక్కజొన్న, తదితర పంటలు సాగు చేస్తున్నారు. మండలంలోని తామరఖండి, కొత్తవలస, గెడ్డలుప్పి, రేపటివలస, చినబోగిలి, రెడ్డివానివలస, లచ్చయ్యపేట, పణుకుపేట గ్రామాల రైతులు పామాయిల్ ఇతర పంటలు సాగు చేస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి

మక్కువ: విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలని గిరిజన శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పిల్లల బంగారు భవిష్యత్ కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఒక అడుగు ముందుకు వేయాలని సూచించారు. పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు కాంపౌండ్ వాల్, భవన మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు కోరగా.. మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, ఎంపీడీఓ స్వరూపారాణి, తహసీల్దార్ షేక్ ఇబ్రహీం, హెచ్ఎం హేమలత, టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాలరావు, జనసేన సాలూరు నియోజకవర్గ నాయకుడు గేదెల రిషవర్ధన్, టీడీపీ నాయకులు మావుడి ప్రసాదరావునాయుడు, పి. మల్లేశ్వరరావు, కేశవ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

- ఎస్పీ మాధవరెడ్డి

సాలూరు: విద్యార్థులు మాదకద్రవ్యాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. పట్టణంలోని బోనువీధి ప్రభుత్వ హైస్కూల్‌ను శనివారం ఆయన సందర్శించారు. అక్కడ జరుగుతున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతాయి.. వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. విద్యార్థులు ఒక లక్ష్యంతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పీఎస్ బొడ్డవలస పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎస్పీ దిలీప్‌కిరణ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. కార్యక్రమంలో సీఐ అప్పలనాయుడు, తహసీల్దార్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంలో అక్రమాలు

సీతంపేట:

సీతంపేట ఏజెన్సీలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనుల్లో పలు అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీల్లో తేటతెల్లమైంది. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి హామీ సామాజిక తనిఖీలపై శనివారం ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో రూ.35,16,92,000తో పనులు చేపట్టారు. వాటిని 12 మంది సీఆర్‌పీలు, 2 ఎస్ఆర్‌పీల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పరిశీలించారు. పనులు జరిగాయా లేదా, వేతనదారులకు నిధులు చెల్లింపు ఎలా జరిగింది, కొలతలు ఇతర అంశాలపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ప్రజావేదిక సభలో ఆ నివేదికలను వెల్లడించారు. డుమా పీడీ రామచంద్రరావు మాట్లాడుతూ.. అక్రమాలు జరిగిన పనులకు రికవరీ చేయాలని ఆదేశించారు. పనిచేసిన చోట బోర్డులు పెట్టకుండా నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు చెల్లించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై బోర్డులు పెట్టనిదే బిల్లులు ఇవ్వవద్దని ఆదేశించారు. ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా జరిగిన పనులకు సంబంధించి గొయ్యిగూడ–జోడిమానుగూడ వరకు తారురోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షల నిధులు మంజూరైతే కేవలం సీసీరోడ్డు పనులు చేశారు. అలాగే కోసంగి–లాడ గ్రామానికి కూడా బీటీరోడ్డు మంజూరైతే రూ.33లక్షలతో సీసీరోడ్డు వేసి చేతులు దులుపుకున్నట్టు గుర్తించారు. పైగా ఈ సమావేశానికి ఇంజినీర్లు కూడా రాకపోవడంతో ఆగ్రహించారు.

సంతకాలు లేకుండా బిల్లు చెల్లింపులు చేస్తే సంబంధిత కంప్యూటర్ ఆపరేటర్‌ను తొలగించాలని ఆదేశించారు. కొన్ని గ్రామాల్లో వలంటీర్లకు అదనపు చెల్లింపులు చేశారని సోషల్ ఆడిట్‌లో డీఆర్‌పీలు చదివి వినిపించారు. ఇలాంటి చెల్లింపులు చెల్లించవద్దని రెండేళ్లుగా చెపుతున్నా పద్ధతి మారలేదని పీడీ అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ, ఎంపీడీవో కె.గీతాంజలి, ఏపీడీ శ్రీహరి, ఏపీవోలు సాగర్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



సోషల్ ఆడిట్ ప్రజావేదిక నిర్వహిస్తున్న డుమా పీడీ రామచంద్రరావు

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- మంత్రి మనోహర్

సీతానగరం: ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టి ప్రథమంగా శనివారం జిల్లాకు వచ్చిన ఎన్. మనోహర్‌కు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, నియోజకవర్గ జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, రైస్ మిల్లర్ల సంక్షేమ సంఘ జిల్లా నాయకులు లచ్చయ్యపేట వద్ద ఘనస్వాగతం పలికారు. ముందుగా స్థానిక మాజీ సర్పంచ్ వి. సూర్యకుమారి ఆధ్వర్యంలో మహిళలు హారతిచ్చి స్వాగతం పలుకగా, జిల్లా రైస్ మిల్లర్ల సంఘ నాయకులు పూలదండలు, శాలువాలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, రైస్ మిల్లర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు రవి మాస్టారు, టీడీపీ నాయకులు వెంకటనాయుడు, బార్నాల సీతారామ్, ఆర్. వేణుగోపాల్, పి. సత్యంనాయుడు, వి.గుంపస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వరి పనల పరిశీలన..

పార్వతీపురం టౌన్: మండలంలోని పెదబొండపల్లిలో పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా వరి పనలను పరిశీలించారు. అనంతరం రైతుసేవా కేంద్రాన్ని సందర్శించి ధాన్యం కొనుగోలు పరికరాలను పరిశీలించి సిబ్బంది పలు సూచనలు చేశారు. రైతులతో ముఖాముఖి మాట్లాడుతూ మంచి దిగుబడి, ఆదాయాన్ని పొందడానికి మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో కొత్త ఆలోచనలు, కొత్త విధానాలు, కొత్త సంస్కరణలతో ముందుకు రావాలని సూచించారు. రైతులకు సబ్సిడీపై టార్పాలిన్లు అందించామన్నారు. రైతుల సమస్యలు ప్రభుత్వానికి తెలుసునని, ఆర్థికంగా భారం ఉన్నప్పటికీ అమలు చేస్తున్నామని చెప్పారు. మంత్రి వెంట స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, అధికారులున్నారు.

టీకాలు తప్పనిసరి

- వైద్యారోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్ మోహనరావు



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగన్ మోహనరావు

పార్వతీపురం టౌన్: చిన్నారులకు తప్పకుండా టీకాలు వేయాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 21వ వార్డులో వైద్య సిబ్బంది నిర్వహించిన టీకా కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. టీకాలకు అర్హులైన పిల్లలు, గర్భిణుల వివరాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు వారి వయసును బట్టి వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయాలని సూచించారు. తద్వారా పోలియో, క్షయ, హెపటైటిస్, అతిసార, న్యుమోనియా, కోరింత దగ్గు, కంఠసర్పి, ధనుర్వాతం, తట్టు, రుబెల్లా, దృష్టిలోపం,తదితర సమస్యల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చన్నారు. అనంతరం అంగన్‌వాడీ చిన్నారులకు వేస్తున్న టీకాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి రవిచంద్ర, ఆరోగ్య పర్యవేక్షకులు పుష్ప, జయగౌడ్, ఏఎన్ఎం ఉమ, అంగన్‌వాడీ సిబ్బంది సుబ్బ లక్ష్మి, ఆశ కార్యకర్త, తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రులే మార్గదర్శకులు



మాట్లాడుతున్న కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: విద్యార్థులకు తల్లిదండ్రులే మార్గదర్శకులని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక డీవీఎం పురపాలక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 45 వేల ప్రభుత్వ పాఠశాలల్లో ఆత్మీయ కలయిక కార్యక్రమం ప్రారంభించడం జరిగిందన్నారు. విద్యార్థులకుహెల్త్ కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే దేశ భవిష్యత్ బాగుంటుందన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థుల ప్రొగ్రెస్ కార్డులను పరిశీలించారు.

కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. గోవిందరెడ్డి, ఉపాధ్యాయులు ఎన్. దయానిధి, నాగభూషణరావు, రమణమ్మ, సూర్యనారాయణ, పద్మ, లతా, అశోక్ నాయుడు, సూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు

కొమరాడ: గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయాల సమస్య లు తక్షణమే పరిష్కరించాలని సీపీఎం నాయకుడు కొల్లి సాంభమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు కొమరాడ గురుకుల పాఠశాల వద్ద శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గిరిజన గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు గత 18 రోజులుగా నిరసనలు తెలియజేస్తున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అధికారంలోకి వస్తే అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను అన్ని విధాలా ఆదుకుంటామని ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికల ముందు హామీ ఇచ్చారని, హామీ అమలు దిశగా ఆలోచన చేయాలని కోరారు. లేదంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.